ఏటీసీ కోర్సులతో సత్వర ఉపాధి: కలెక్టర్

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ కోర్సులతో సత్వర ఉపాధి అవకాశాలు ఉంటాయని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హత్నూర ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వరంగ సంస్థల్లోనూ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్హత ఉన్న విద్యార్థులు ఈనెల 30వ తేదీలోగా తక్షణ ప్రవేశాలు పొందాలని సూచించారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

గ్రామ కంఠం భూమిని కాపాడండి: గుమ్మడిదలలో గ్రామ కంఠం భూమి కబ్జా చేసి ప్లాట్లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాని సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, మహబూబ్‌ఖాన్, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ అభినందనీయం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక సేవ చేయడం అభినందనీయమని డీసీసీబీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం అన్నారు. మంగళవారం సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఎన్‌ఎస్ఎస్ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల్లో చైతన్యం నింపేందుకు విద్యార్థులు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ నరేంద్రరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సయ్యద్ వాహిద్‌పాషా, ఏరువాక కేంద్రం శాస్త్ర వేత్త రాహుల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఉపేందర్, శ్రీలత, అరుణ, శ్రీరంజిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు అంతరాయంపై ఉపకేంద్రం ముట్టడి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

జహీరాబాద్ అర్బన్, (న్యాల్‌కల్): విద్యుత్తు సరఫరాలో అంతరాయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ న్యాల్‌కల్ మండలం బసంత్‌పూర్, కల్‌బెమల్ గ్రామస్థులు మెటల్‌కుంట ఉపకేంద్రాన్ని సోమవారం రాత్రి ముట్టడించారు. కరెంట్ సరఫరాను ఎందుకు నిలిపివేస్తున్నారని జూనియర్ లైన్‌మెన్ ప్రవీణ్, సిబ్బందిని నిలదీశారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. నిత్యం రాత్రి పూట విద్యుత్తు కోతల కారణంగా విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోందని, ఇళ్లలో ఉండలేకపోతున్నామని వారు వాపోయారు. విద్యుత్తు సిబ్బందిపై గ్రామస్థులు దురుసుగా ప్రవర్తించారని ఏఈ అర్జున్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరితే మాపై ఫిర్యాదు చేయడం ఏఈకి తగదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఏఈ, విద్యుత్తు సిబ్బంది తమను దుర్భాషలాడారని వారు కూడా ఫిర్యాదు చేశారు. ఘటనపై ఆరా తీసిన ఉన్నతాధికారులు జూనియర్ లైన్‌మెన్‌ను జహీరాబాద్ డీఈఈ కార్యాలయానికి సరెండర్ చేశారు.

జలవనరుల సంరక్షణ.. అధికారుల కార్యాచరణ

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్:


సంగారెడ్డి పట్టణం ఎర్రకుంటలో హద్దులు కొలుస్తున్న అధికారులు

రాష్ట్ర రాజధానికి జిల్లా సమీపంలో ఉండడంతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. భూముల ధర రూ.కోట్లలో పలుకుతోంది. అదే స్థాయిలో నీటి వనరుల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) పరిధిలోని జల వనరుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందు కోసం ముందస్తుగా తొలి విడతలో జిల్లాకు రూ.35.94 లక్షలు మంజూరు చేశారు. ఈ ప్రక్రియ పక్కాగా అమలు చేస్తే అన్యాక్రాంతానికి అడ్డుకట్ట వేయవచ్చు.

కబ్జాల పరంపర

సంగారెడ్డి నాందేడ్- అకోలా జాతీయ రహదారి విస్తరణ, త్వరలో చేపట్టనున్న ప్రాంతీయ రింగ్‌రోడ్డు భూసేకరణ వంటి వాటితో హెచ్ఎండీఏ పరిధిలోని మండలాల్లో భూములు ధరలు విపరీతంగా పెరిగాయి. జల వనరులను రియల్ వ్యాపారులు కబ్జా చేసేశారు. నీటిపారుదల, రెవెన్యూ, పురపాలక, హెచ్ఎండీఏ శాఖల అధికారులు నాలాలకు అనుమతులు ఇవ్వడం వల్ల ఇళ్లు నిర్మించారన్న విమర్శలున్నాయి. ఇందులో రాజకీయ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హెచ్ఎండీఏ పరిధిలోని నీటి వనరుల్లో అక్రమ కట్టడాలను కూల్చేందుకు అమీన్‌పూర్‌లో హైడ్రా చర్యలకు ఉపక్రమించింది. మిగిలిన మండలాల్లో చర్యలు చేపడతారని భావించినా, అవుటర్ రింగ్ రోడ్డులోపల ఉన్న గ్రామాల్లో, పట్టణాల్లో అక్రమ కట్టడాలను కూల్చి వేస్తుందని ప్రకటించడంతో కొంత మందికి ఊరటనిచ్చింది. వ్యాపారులకు మేలు జరిగినా, ఆయా ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరుచుకున్న వారికి అవస్థలు తప్పేలా లేదు.

అడ్డుకట్ట వేసేందుకు చర్యలు



గతంలో జల వనరులు చాలా వరకు ఆక్రమణకు గురయ్యాయి. ఇక నుంచి కబ్జాలకు గురికాకుండా కంచె, కడీలు పాతి సంరక్షణ చర్యలు చేపడుతాం. చెరువులు, కుంటల్లోని శిఖం, బఫర్ జోన్లలో స్థలాలను కొనుగోలు చేయొద్దు. – జైభీం, ఈఈ, సంగారెడ్డి.

హెచ్ఎండీఏ పరిధిలో లెక్కలిలా..

- మండలాలు: 8
- మొత్తం నీటి వనరులు:666
- ప్రాథమికంగా సర్వే చేసినవి: 409
- అభ్యంతరాలు వచ్చాక సర్వే చేసినవి: 58
- ఇంకా సర్వే చేయాల్సినవి: 199
- జిల్లాకు నిధులు: రూ.35.94లక్షలు

ఎనిమిది మండలాల్లోనే...

జిల్లాలో హెచ్ఎండీఏ పరిధిలో అమీన్‌పూర్, గుమ్మడిదల, హత్నూర, జిన్నారం, కంది, పటాన్‌చెరు, రామచంద్రాపురం, సంగారెడ్డి మండలాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో నీటి వనరులు సర్వే చేసి, హద్దులు పాతాలని 2013లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించినా, అడుగు ముందుకు పడలేదు. రానురాను చాలావరకు నీటి వనరుల్లోనే నిర్మాణాలు చేపట్టడంతో నామరూపాలు లేకుండా పోయాయి. ఎనిమిది మండలాల్లో 666 జల వనరులున్నాయని సంబంధిత శాఖ వర్గాలు లెక్క తేల్చాయి. సర్వే చేసి సరిహద్దులు గుర్తించారు. వాటిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, తదితర రకాలుగా ఆక్రమణకు గురయినట్లుగా గుర్తించారు. ఇక నుంచి కంచెల ఏర్పాటు, కడీలు పాతి సంరక్షించాలని జిల్లా నీటిపారుదల శాఖ ఆలోచిస్తోంది.


ఇంటికి నంబరు వేస్తున్న సిబ్బంది

పదేళ్లుగా సాగి.. నేడు ప్రశ్నార్థకంగా మారి!


నిలిచిన బహుళ వాణిజ్య సముదాయం నిర్మాణం

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: దక్షిణమధ్య రైల్వే ప్రతిపాదించిన బహుళ వాణిజ్య సముదాయం పనులు ఆగిపోయాయి. రైల్వే శాఖ, ప్రైవేటు భాగస్వామ్యంతో జహీరాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో పదేళ్ల కిందట పనులు ప్రారంభించారు. ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లోని రైల్వేస్టేషన్‌లో బహుళ వాణిజ్య సముదాయాలు నిర్మించాలని పదేళ్ల కిందట ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో అప్పటి ప్రభుత్వం జహీరాబాద్‌ను వాణిజ్య సముదాయాల జాబితాలో చేర్చింది. స్టేషన్ పరిసరాల్లో స్థలం అందుబాటులో ఉండటంతో వాణిజ్య సముదాయం మంజూరయింది. అనుమతులు, ఉత్తర్వులు వెలువడంతో ప్రతిపాదనలకు మోక్షం దక్కినా పనులు ముందుకు సాగడంలేదు.

అసంపూర్తిగా..: రైల్వే, ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.20 కోట్లకు పైగా నిధులతో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం నిర్వహణ బాధ్యతలను 40 ఏళ్ల పాటు ఓ నిర్మాణ సంస్థకు అప్పగించారు. నిర్మాణ సంస్థ అద్దె, లీజు ప్రాతిదికన ముందుకు వచ్చే ఔత్సాహికులు, వ్యాపారులకు స్థలం కేటాయింపులు చేపట్టాలని నిర్ణయించారు. వస్త్ర, వాణిజ్య, వ్యాపార దుకాణాలు సహా బంగారు నగల దుకాణాలు, రెస్టారెంట్లు, హోటళ్లు, కార్యాలయాలు, ఔత్సాహికులు ముందుకు వస్తే మల్టిప్లెక్స్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి మొదట్లో పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కోవిడ్ సమయంలో పనులు నిలిపివేశారు. నిర్వహణ లేక పార్కు ఎండిపోతోంది. జహీరాబాద్ ఎంపీ సురేష్ శెట్కార్ దృష్టి సారించి పనులు మొదలయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అంకితభావంతో పని చేస్తేనే మన్నన: ఎస్పీ


పోలీసు శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి అర్బన్,న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తేనే ప్రజలనుంచి మన్నన లభిస్తుందని ఎస్పీ రూపేష్ అన్నారు. మంగళవారం కంది మండలం చిద్రుప్ప పోలీసు శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి, శిక్షణ కానిస్టేబుళ్లతో మాట్లాడారు. తొమ్మిది నెలలపాటు శిక్షణ ఉంటుందని, అనంతరం నిర్వహించే పరీక్షలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని సూచించారు. తుది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి, పూర్తి స్థాయిలో కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట అదనపు ఎస్పీ సంజీవరావు, వైస్ ప్రిన్సిపల్ రమేశ్, ఆర్ఐ శ్రీనివాస్ ఉన్నారు.

ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు

జిన్నారం, గుమ్మడిదల, న్యూస్‌టుడే: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎస్పీ రూపేష్ పోలీసు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన జిన్నారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి, ఫిర్యాదుదారులకు ఉండాల్సిన కనీస వసతులను పరిశీలించారు. ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ఆయన గుమ్మడిదల ఠాణాను సందర్శించారు. ఠాణా నూతన భవనం కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించేలా నిర్మించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు, కేసుల వివరాలను తెలుసుకున్నారు. పోలీసు ఠాణా నూతన భవన పనులను పరిశీలించారు. హెటిరో పరిశ్రమ హెచ్ఆర్ మేనేజర్లు కృష్ణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి భవన నిర్మాణం వివరాలను ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో సీఐ సుధీర్‌కుమార్, గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, పరిశ్రమ సివిల్ పర్యవేక్షకులు ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మంగళవారం సందర్శించారు. కళాశాలలో సదుపాయాలపై ఆరా తీశారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల సంఖ్య అధికంగా ఉండడంపై సంతోషం వ్యక్తం చేశారు. కళాశాలలో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కామర్స్ విద్యార్థులకు నీటి వసతి కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రత్నప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లలు పంపిణీ చేయరా: సీజన్ ముగుస్తున్నా చేప పిల్లలను నీటి వనరుల్లో వదిలే కార్యక్రమం చేపట్టకపోవడం సరికాదని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంగారెడ్డి పట్టణ శివారులో ప్రారంభమైన ఇర్ఫాని దర్గా ఉర్సు ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత బస్టాండ్ సమీపంలోని జామియా మసీదు నుంచి గంధం ఊరేగింపు నిర్వహించారు దర్గా పీఠాధిపతి అహ్మద్ బిన్ ఉమర్ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించేవరకు ఆందోళన

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు అందాల్సిన డీఏ, పీఆర్సీ బకాయిలపై దశల వారీగా ఆందోళన చేపడతామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి అన్నారు. జహీరాబాద్ మండలం ఖాసింపూర్ పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో వారు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కరపత్రాలను స్థానిక ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు.

గడ్డపోతారంలో డీఎల్‌పీవో విచారణ

జిన్నారం, న్యూస్‌టుడే: జిన్నారం మండలం గడ్డపోతారంలో మంగళవారం డీఎల్‌పీవో అనిత విచారణ చేశారు. గతేడాది గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని 72, 80, 83, 84, 85, 89, 80బై ఏ, 86బై ఏఏ, 86బై ఇ సర్వేనంబర్లలోని ఆరు ఎకరాల ఖాళీ స్థలంలో ఇంటి నంబర్లు కేటాయించారు. ఈ వ్యవహారాన్ని అప్పట్లో ‘ఈనాడు’ వెలుగులోకి తీసుకురాగా పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో రికార్డులను డీఎల్‌పీవో పరిశీలించారు. మొత్తం ఎన్ని ఇంటి నంబర్లు ఇచ్చారని ఆరా తీశారు. అనంతరం గ్రామ శివారులోని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు.

జిల్లా ఆస్పత్రిలో సదరం శిబిరం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరం శిబిరం నిర్వహించామని ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు. 133 మంది హాజరయ్యారని, వారికి ఆయా విభాగాల వైద్యులు పరీక్షలు చేశారని చెప్పారు.

పురపాలికలుగా పంచాయతీలు!


గడ్డపోతారం పంచాయతీ కార్యాలయం

న్యూస్‌టుడే, జిన్నారం: నగరాన్ని విస్తరించే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగానే హైదరాబాద్ శివారులో ఉన్న పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక మార్పులు రానున్నాయి. ఉమ్మడి జిన్నారం మండలంలో రెండు పురపాలికల కోసం ప్రతిపాదనలు వెళ్లాయి. వీటిలో జిన్నారం మండలం గడ్డపోతారం కేంద్రంగా పురపాలిక ఏర్పాటు కానుందనే ప్రచారం ముమ్మరమైంది. ఇందులో ఖాజీపల్లి, వావిలాల, నల్తూరు, లక్ష్మీపతిగూడెం, మాదారం పంచాయతీలు విలీనం కానున్నట్లు తెలుస్తోంది. గడ్డపోతారాన్ని పురపాలికగా మార్చాలని గతంలోనే పాలక వర్గం తీర్మానం చేసినట్లు సమాచారం. ఇదే సమయంలో కొందరు మాజీ సర్పంచులు పురపాలికలను వ్యతిరేకిస్తుండగా, మరి కొందరు సమ్మతిస్తున్నారు. గుమ్మడిదల కేంద్రంగా మరోటి ఆవిర్భవించనుందనే సమాచారం ఉంది. ఇందులో బొంతపల్లి, దోమడుగు, అన్నారం, వీరన్నగూడెం, మంబాపూర్‌లు చేరుతాయని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే ఆయా పంచాయతీల విస్తీర్ణం, ఆదాయం, జనాభా వంటి వివరాలు సేకరించి ప్రతిపాదనలు పంపారు. దీంతో జిన్నారం మండలంలో పంచాయతీల సంఖ్య 9కి పడిపోతుండగా, గుమ్మడిదలలో ఏడింటికి పరిమితం అవనున్నాయి. పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ పురపాలిక అవుతుండగా, కొన్ని పంచాయతీలు జీహెచ్ఎంసీలో చేరనున్నాయనే ప్రచారం జరుగుతోంది.

జనవరి నుంచే జీహెచ్ఎంసీ పరిధికి: బాహ్యవలయ రహదారి లోపల ఉన్న పురపాలికలు జీహెచ్ఎంసీ పరిధిలోకి వెళ్లనున్నాయి. ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలం ముగిసిన వెంటనే ఈ ప్రక్రియకు శ్రీకారం చుడతారని, ఇందుకు గాను జనవరి ముహూర్తం అని ఓ అధికారి చెప్పారు. ఐడీఏ బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ పురపాలికలు చేరనున్నాయి.

నాయకుల్లో ఉత్కంఠ: ఈ పరిణామాలతో నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. పంచాయతీలుగా ఉంటే వార్డు సభ్యులు, ఉప సర్పంచి, సర్పంచి, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ వంటి పదవులు ఉంటాయని, లేదంటే వాటిని కోల్పోవాల్సి వస్తుందని నాయకులు తర్జనభర్జన పడుతున్నారు.

ముగిసిన కుట్టు శిక్షణ

సదాశివపేట, న్యూస్‌టుడే: తెలంగాణ స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో కుట్టు శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అపర్ణ పాటిల్ మాట్లాడుతూ కుట్టు శిక్షణ మహిళల ఉపాధికి ఉపయోగపడుతుందన్నారు. అంతకుముందు సంస్థ ప్రతినిధులతో కలిసి మహిళలకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోపాల్, నాయకులు సంస్థ ప్రతినిధులు శివరాజ్ పాటిల్, పద్మ, ప్రవీణ్, రమా పాల్గొన్నారు

అమృత్ పథకం.. ఆమడదూరం!


మంజీర నదిలో నిరుపయోగంగా ఇన్‌టేక్‌వెల్

న్యూస్‌టుడే, జహీరాబాద్: ఇంటింటికి తాగు నీటిని అందించాలని గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. జహీరాబాద్ పట్టణంలో ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మొత్తం పట్టణానికి నీటిని అందించాలని రూ.66 కోట్లతో రెండేళ్ల కిందట ప్రతిపాదించిన అమృత్ పథకం కార్యరూపం దాల్చలేదు.

తప్పని ఎదురు చూపులు: జహీరాబాద్ పురపాలికలో 1.20 లక్షల జనాభా, 37వార్డులు, 14వేలకు పైగా గృహాలున్నాయి. రోజుకు 1.60 కోట్ల లీటర్ల నీరు అవసరం ఉండగా, ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా 80 లక్షల లీటర్లు, బోర్ల ద్వారా మరో 20 లక్షల లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. పట్టణంలో నాలుగేళ్ల కిందట మిషన్ భగీరథ పథకం చేపట్టినా, ఇంకా 20శాతం వార్డుల్లో పైపులు వేయలేదు. మరో 20 శాతం ప్రాంతాల్లో పైపులైను వేసినా నీటిని సరఫరా చేయడం లేదు. అమృత్ పథకం ద్వారా మరో 70 లక్షల లీటర్ల నీటిని అందించి, భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా చేయాలని ప్రతిపాదించినా, ప్రారంభానికి నోచలేదు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తాం..

ఈ పథకంపై పూర్తి అవగాహన లేదు. త్వరలోనే మిషన్‌భగీరథ, ప్రజారోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి పరిస్థితిని తెలుసుకుని ఉన్నతాధికారుల సూచనల మేరకు పనులు వేగంగా సాగేలా చూస్తాం. – శ్రీనివాస్ రెడ్డి, కమిషనర్ పురపాలక సంఘం.

పునరుద్ధరణకు నోచని పథకం: పట్టణానికి 20ఏళ్లుగా రాయికోడ్ మండలం ఇటికేపల్లి శివారు మంజీరా నది నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. దాదాపు 44కిలోమీటర్ల దూరం ఉండడంతో బోర్లు తరుచుగా కాలిపోవడం, పైపులైన్లు పగిలిపోయి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఐదేళ్ల కిందట రెండేళ్ల పాటు ఏర్పడిన వర్షాభావంతో నది పూర్తిగా ఎండిపోవడంతో పథకాన్ని పూర్తిగా నిలిపివేశారు. అంతలోనే మిషన్ భగీరథ రావడంతో నిరుపయోగంగా మారింది. అమృత్ పథకం నిధుల ద్వారా పునరుద్ధరించాలని నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు.

చేరేందుకు ఉత్సాహం.. ఏదీ ప్రోత్సాహం!

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్:



ఇది పోటీ ప్రపంచం. ఈ రోజుల్లో చదువు ఒక్కటే ఉంటే సరిపోదు. అదనపు అర్హతలు ఉంటేనే జీవితంలో స్థిరపడేందుకు వీలుంటుంది. ఈ ఉద్దేశంతో ప్రభుత్వం విద్యా వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నేషనల్ కేడెట్ కార్ప్స్(ఎన్‌సీసీ) ప్రారంభించాలని గతేడాది నిర్ణయించింది. జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపినా, ఇంతవరకు అడుగు ముందుకు పడలేదు.

ఐదు కళాశాలల్లో ఏర్పాటుకు..

ఎన్‌సీసీని ప్రారంభించాలంటే సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య 500 కంటే ఎక్కువ ఉండడంతోపాటు, అదే కళాశాలకు చెందిన ఓ రెగ్యులర్ అధ్యాపకుడు ఎన్‌సీసీ శిక్షణ పొంది, విద్యార్థులకు తర్ఫీదునిచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేయాలి. ఈ నిబంధనలకు అనుగుణంగా జహీరాబాద్, సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల, నారాయణఖేడ్, కోహీర్, రామచంద్రాపురం కళాశాలలను ప్రతిపాదించారు. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం గమనార్హం. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 20 కొనసాగుతున్నాయి. వీటిల్లో 8వేల విద్యార్థులున్నారు

ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది



ఇంటర్ బోర్డు ఆదేశాలకు అనుగుణంగా ఎన్‌సీసీ ప్రారంభించేందుకు అర్హత ఉన్న కళాశాల వివరాలతో గతంలో ప్రతిపాదనలు పంపాం. వాటికి ఆమోదం లభించగానే తరగతులు ప్రారంభమవుతాయి. దేశభక్తిని చాటేందుకు విద్యార్థులకు ఎన్‌సీసీ వేదిక అవుతుంది. దీనిని పూర్తిచేస్తే విద్యార్థులకు అదనపు అర్హతగా ఉంటుంది. క్రమశిక్షణ కూడా అలవడుతుంది.
– గోవిందరామ్, జిల్లా ఇంటర్ విద్యాధికారి.

సేవకు సిద్ధంగా ఉన్నా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎన్‌సీసీని ప్రవేశపెట్టడం ద్వారా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే వీలుంటుంది. దేశభక్తితోపాటు, అవసరమైతే దేశ రక్షణకు ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధమవుతారు. దీంతో పాటు సేవాతత్పరత చాటుతారు. ఎక్కడైనా ప్రకృతివైపరీత్యాలు సంభవించాయని తెలిస్తే అక్కడికి చేరుకుని సేవలందిస్తారు. ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నా, వారికి ప్రోత్సాహం లభించడంలేదు.

విద్యార్థులకు ప్రయోజనం: ప్రస్తుతం ఎన్‌సీసీ సహ పాఠ్య కార్యక్రమంగా కొనసాగిస్తారు. విద్యార్థులు ఇంటర్ విద్య చదువుతూనే ఎన్‌సీసీలోనూ రాణించడం ద్వారా అదనపు ప్రయోజనం ఉంటుంది. ఇప్పటికే ఉన్నత విద్యలో చేరాలనుకునేవారు ‘సి’ సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఇంటర్‌లో ఎన్‌సీసీలో చేరిన వారు డిగ్రీలోనూ కొనసాగించే వీలుంటుంది. డిగ్రీ స్థాయిలో ఎన్‌సీసీని కోర్సుగా గుర్తించాలని యూజీసీ నిర్ణయించిన నేపథ్యంలో ఇతర పాఠ్యాంశాల మాదిరిగానే క్రెడిట్లు పొందే వీలుంటుంది.

ఉపకార వేతనాలు విడుదల చేయండి


బీసీ విద్యార్థి సంఘం ఆధ్వరంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

సంగారెడ్డి అర్బన్: విద్యార్థులకు ఉపకార వేతనాలు, బోధన రుసుం విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సాయిబాషా ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు బకాయి ఉన్న రూ.7వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌వో పద్మజారాణికి వినతిపత్రం అందించారు.

ఏబీవీపీ ‘చలో కలెక్టరేట్ ’: ఏబీవీపీ ఆధ్వర్యంలో ‘చలో కలెక్టరేట్’ చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఆకాశ్ మాట్లాడుతూ బకాయిపడిన వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, బోధన రుసుం బకాయిలు విడుదల చేయాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహేశ్ మాట్లాడుతూ ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు.

24న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మెదక్ అర్బన్: ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన మెదక్ పట్టణంలోని మైదానంలో సీనియర్ పురుషుల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. ఎంపికైన వారు సికింద్రాబాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఎంపికల్లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 9347344440, 77300 50873 నంబర్లలో సంప్రదించాలన్నారు.



నేనేం తప్పు చేశానమ్మా..
నెలల పాటు గర్భంలో
నన్ను మోశావు..
ఈ లోకంలోకి తీసుకొచ్చి అనాథగా
వదిలేశావు..
జన్మనిచ్చిన నిన్ను కళ్లారా చూసుకునే
అవకాశమే ఇవ్వలేదు..
అన్నింటినీ నేర్పించే అమ్మ ఒడిని దూరం చేశావు..
నెలలు నిండకుండానే పుట్టడం నా తప్పు కాదుగా..
అయినా దిక్కులేని వాణ్నిగా వదిలేశావని..
ప్రశ్నిస్తున్నాడు ఈ నవజాత శిశువు. సిద్దిపేట పట్టణంలో జరిగిన ఈ ఘటన చూపరులను కంటతడి పెట్టించింది.

నెలలు నిండకుండా పుట్టడం నా తప్పా?

నవజాత శిశువును ఊయలలో వదిలెళ్లిన తల్లి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సిద్దిపేట సర్వజన ఆస్పత్రిలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మగశిశువును వదిలేసి వెళ్లిపోయారు. రోగుల బంధువులు కొంతసేపటికి చూసి వైద్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే శిశువును అత్యవసర చికిత్సకు తరలించారు. నెలలు నిండకముందే పుట్టాడని కేవలం 900 గ్రాముల బరువు మాత్రమే ఉన్నాడని, ఆయాసంతో బాధపడుతున్నాడని.. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సురేశ్‌బాబు తెలిపారు. పసిబిడ్డకు సీపాప్ ద్వారా చికిత్స అందిస్తున్నామన్నారు. వైద్యులు రాగిణి, నిఖిత ఆస్పత్రి సిబ్బంది ఆలియా, ఖాజాబీ బాగోగులు చూస్తున్నారు. వైద్యులిచ్చిన సమాచారంతో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు రాము, రాజారాం వచ్చి పరిశీలించారు. శిశువు ఆరోగ్యం కుదుట పడ్డాక శిశుగృహకి తరలిస్తామన్నారు.

కాపాడిన 'ఊయల'

కొంతమంది తల్లులు పిల్లలను చెత్తకుండీలు, ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిన ఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దిపేటలో మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేసిన ఓ ఆలోచన పసిప్రాణాన్ని కాపాడింది. చిన్నారులను పెంచలేకపోతే.. ఎక్కడో పారేయకుండా ఆవరణలో ఊయలలో వేయండి.. అని ఆసుపత్రి వద్ద ఫ్లెక్సీ రాసి పెట్టారు. ఇప్పుడే ఆ నవజాత శిశువుకు తల్లి ఒడి అయింది.


పరీక్షిస్తున్న వైద్యుడు

గంజాయిని.. వేళ్లూనుకోనివ్వద్దు!



గట్లపై సాగు..



మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శెట్టిపల్లికలాన్‌లో ఎలబోయిన భూపాల్ పొలంలోని గట్లపై గంజాయి మొక్కలు సాగు చేశాడు. విశ్వసనీయ సమాచారంతో అధికారులు వాటిని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశారు.

ప్రమాదంలో బయటపడి..



హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న ఓ కారు మెదక్ జిల్లా రామాయంపేట శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. పోలీసులు దాన్ని గుర్తించి తనిఖీ చేయగా 80 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది.

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, వెల్దుర్తి, సిద్దిపేట, మెదక్, వికారాబాద్, రామాయంపేట

గంజాయి సాగు.. సరఫరా.. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో నిత్యకృత్యంగా మారింది. ఆబ్కారీ యంత్రాంగం తనిఖీలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. దొరికితే దొంగ.. లేదంటే రాజా అన్న చందంగా దందా యథేచ్ఛగా సాగుతోంది. ఆరోగ్యానికి హాని చేసే ఈ మత్తుకు యువత, కార్మికులు, విద్యార్థులు ఆకర్షితులవుతూ జీవితాలను పణంగా పెడుతున్నారు. కొన్ని ముఠాలు ఆయా వర్గాల లక్ష్యంగా చేసుకొని పొట్లాలు, చాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. పలు సందర్భాల్లో ఇది రూఢీ అయింది. ఈ తరుణంలో దీని కట్టడే లక్ష్యంగా అడుగేయాల్సిన అవసరం ఉంది.

నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో గంజాయి సాగు, అక్రమ దందా నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాం. జిల్లా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్టేషన్ హౌస్ అధికారి ఆధ్వర్యంలో తరచూ తనిఖీలు చేపడుతున్నాం. అదనంగా చెక్‌పోస్టుల ఏర్పాటు, సరిహద్దులో నిఘా ద్వారా కట్టడి చేస్తున్నాం.

– నవీన్ చంద్ర, జిల్లా ఆబ్కారీ శాఖ అధికారి, సంగారెడ్డి

నాలుగు జిల్లాల్లో గంజాయి కేసులు (జనవరి నుంచి గత సెప్టెంబరు 30 వరకు)

జిల్లా	కేసులు	అరెస్టైంది	స్వాధీనం చేసుకున్న మొక్కలు	దొరికిన ఎండు గంజాయి	విలువ
సంగారెడ్డి	71	108	441	620.16 కిలోలు	రూ. 15,50,4,000
సిద్దిపేట	02	03	26	240 గ్రాములు	రూ. 29,625
మెదక్	14	20	57	1.185 కిలోలు	రూ. 2,60,890
వికారాబాద్	73	148	45	140 కిలోలు	రూ. 6,10,000

తగ్గి.. మళ్లీ పెరిగి..

2014కు ముందు సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో అత్యధికంగా గంజాయి సాగు చేసేవారు. అప్పటి ప్రభుత్వం స్వయం ఉపాధి కింద రుణాలు ఇచ్చి రైతులను సాగు మాన్పించేలా చేసింది. మళ్లీ ఇటీవల దీని సాగు పెరిగింది. ఇటీవల నాలుగు జిల్లాల్లోని నారాయణఖేడ్, రాయికోడ్, మునిపల్లి, న్యాల్‌కల్, వెల్దుర్తి తదితర మండలాల్లో ఆబ్కారీ అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పలువురు పొలం గట్లపై సాగు చేస్తుండటం ఆందోళనకు గురిచేసే అంశం. సాగుకు విత్తనాలు ఒడిశా, విశాఖ ఏజెన్సీ నుంచి తీసుకొస్తున్నట్లు తెలుస్తోంది. సంగారెడ్డి జిల్లాలో 46 మంది రైతులకు ఈ కారణంగానే రైతుబంధు నిలిపివేశారు. మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ ఏజెన్సీ, ఒడిశా నుంచి జిల్లాల మీదుగా సరఫరా అవుతోంది. అక్రమార్కులు ఎండు గంజాయిని పొట్లాలుగా తయారుచేసి పోలీసుల కళ్లుగప్పి రవాణా చేస్తున్నారు.

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వేల్లిలో ఒకరు తన పొలంలో పత్తి, మిరప అంతర పంటగా గంజాయి సాగు చేశాడు. విషయం తెలుసుకున్న ఆబ్కారీ పోలీసులు 20 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. న్యాల్‌కల్‌లోనూ ఇలాంటి ఘటనే జరిగింది.

కొత్త పద్ధతుల్లో..


కూరగాయల వాహనం దిగువన...

నాలుగు జిల్లాల్లో జిన్నారం, ఐడీఏ బొల్లారం, హత్నూర, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, చేగుంట, తాండూరు తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో నివసిస్తున్న ఇతర రాష్ట్రాల వారికి పలువురు గంజాయి సరఫరా చేస్తున్నారు. దీన్ని సాగు చేస్తే సులభంగా సరఫరా చేయడంతో పాటు డబ్బులు సంపాదించవచ్చని పలువురు సాగు బాట పట్టారు.

- ఆబ్కారీ, సివిల్ పోలీసులకు అనుమానం రాకుండా వాహనాల్లో అరలు తయారు చేసి అందులో తరలిస్తున్నారు.

చైతన్యం.. అధ్యయనం..

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్, సంగారెడ్డి గ్రామీణ, సదాశివపేట, కంది


శ్రమదానం చేస్తున్న విద్యార్థినులు

వారంతా నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు.. సామాజిక అంశాలపై చైతన్యం తేవడమే లక్ష్యంగా, గ్రామీణుల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు గ్రామాల బాట పట్టారు. అక్కడే ఉంటూ ప్రజలతో మమేకం అయ్యారు. వ్యాధులు, పోషక లోపం, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై పల్లెవాసుల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. మరోవైపు గ్రామాన్ని శుభ్రం చేశారు. సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులను రైతులకు అవగాహన కల్పించడం విశేషం.

128 మంది విద్యార్థులు..

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ఆచార్య జయశంకర్ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 128 మంది విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఈ నెల 16 నుంచి 22 వరకు సంగారెడ్డి మండలం ఫసల్‌వాదికి వచ్చారు. అధ్యాపకుల పర్యవేక్షణలో సామాజిక సేవలో పాల్గొన్నారు. రోజువారీగా కార్యక్రమాలు చేపట్టారు.

గ్రామీణ జీవనంపై సర్వే..

గ్రామీణుల జీవనాన్ని తెలుసుకునేందుకు ముందుగా సర్వే చేశారు. ఏ పంట ఎంత మంది పండిస్తున్నారు, రోగాల తీరు, ప్రధాన సమస్యలు, తాగునీటి లభ్యత, తదితర వివరాలపై సర్వే చేశారు. ఆయా వివరాలను సంబంధిత శాఖ అధికారులకు అందజేశారు. స్థానిక చెరకు కర్మాగారాన్ని సందర్శించారు. దిగుబడి, చక్కెర ఉత్పత్తి తీరు, తదితర అంశాలు తెలుసుకున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

భూసార పరీక్షల ప్రాధాన్యాన్ని రైతులకు వివరించారు. రసాయనాల వినియోగంతో కలిగే నష్టాలు, సేంద్రియ ఎరువులతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తుమందు ఇతర వాటితో కలిగే అనర్థాలపై ర్యాలీలు నిర్వహించారు. ఈ మేర అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో కిచెన్ గార్డెన్ పెంచేలా ప్రోత్సహించారు. వ్యవసాయ, ఉద్యాన, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలతో సూచనలు ఇప్పించారు.

ఎన్నో విషయాలు తెలుసుకున్నా

– ఎస్.అజయ్‌కుమార్, విద్యార్థి



క్షేత్రస్థాయిలో ఎన్నో విషయాలు తెలుసుకున్నా. గ్రామంలో అత్యధికంగా వరి, పత్తి, చెరకు, కూరగాయలు సాగు చేస్తున్నారు. మంజీర నది పరివాహక ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. ప్రజల జీవనస్థితిగతులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది.

సంతోషంగా ఉంది

– బి.సుష్మస్వరాజ్, విద్యార్థిని



సామాజిక సేవలో పాల్గొనడం సంతోషంగా ఉంది. నాలుగేళ్లుగా తరగతి గదులకు పరిమితం అయ్యాం. తొలిసారిగా పల్లెటూరికి వచ్చి ఇక్కడి వారి జీవన స్థితిగతులు తెలుసుకున్నా. పలు అంశాలపై అవగాహన కల్పించాను.


ఐఎస్‌వో ధ్రువపత్రాలను ప్రదర్శిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపక బృందం

సిద్దిపేట మహిళా డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు

సిద్దిపేట: సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఐఎస్‌వో గుర్తింపును పొందింది. పచ్చదనం, విద్యా బోధన, పాలన, వసతులు, ఈ-వ్యర్థాల నిర్వహణ, ఇతర అంశాల ప్రాతిపదికన మూడు ఐఎస్‌వో ధ్రువపత్రాలను మంగళవారం అందుకున్నారు. ఆయా అంశాలపై ఐఎస్‌వో బృందం ప్రత్యక్షంగా తనిఖీ చేసి ప్రదానం చేయడం విశేషం. ప్రిన్సిపల్ జీవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ శ్యామ్, అధ్యాపకులు హర్షం వ్యక్తంచేశారు.

సైక్లింగ్‌లో సత్తా చాటిన అన్నాదమ్ముళ్లు


అందుకున్న పతకాలు, సర్టిఫికెట్లతో అమిత్, సుమిత్

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్లంపల్లికి చెందిన అన్న, తమ్ముడు ఇద్దరు సూరంపల్లి అమిత్, సుమిత్ సైక్లింగ్ పోటీల్లో సత్తా చాటారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 8వ రాష్ట్ర స్థాయి ట్రాక్ సైక్లింగ్ పోటీలు గత వారం జరిగాయి. అండర్-16 బాలుర వ్యక్తిగత 5 కి.మీ విభాగంలో అమిత్ విజేతగా నిలిచి బంగారు పతకం, సుమిత్ రెండో స్థానంతో రజత పతకం సాధించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకటనర్సయ్య తెలిపారు. ఇద్దరినీ సైక్లింగ్, యోగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మల్లారెడ్డి, మనోహర్, సాయ్ డైరెక్టర్ చంద్రారెడ్డి, విజయకాంతారావు, కోచ్‌లు విజయభాస్కర్‌రెడ్డి, సంజీవ్ అభినందించారు.

పిల్లల పండగ గోడపత్రిక ఆవిష్కరణ



జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ పట్టణంలో నవంబర్ 10న 'జహీరాబాద్ పిల్లల పండగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కన్వీనర్ డా.విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని శ్రామిక విజ్ఞాన కేంద్రంలో మంగళవారం పిల్లల పండగ గోడపత్రికను విజ్ఞాన కేంద్రం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. మూడు కేటగిరీల్లో 30కి పైగా ఈవెంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం ప్రతినిధులు రాంచందర్, శివబాబు, మహిపాల్, వెంకటేష్, పూలమ్మ, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సస్యరక్షణపై అవగాహన

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కంది, శనగ సాగులో సేంద్రియ సస్యరక్షణ చర్యలు మేలని జహీరాబాద్ డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం పంటల యాజమాన్యం శాస్త్రవేత్త డా. రమేష్ అన్నారు. మండలంలోని ఒంటెలగడ్డ తండా, జీడిగడ్డ తండాలో మంగళవారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కంది, శనగ పైరుల్లో లింగాకర్షణ బుట్టలు, వేప నూనె కషాయం వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు.

ప్రాణం తీసుకుని వేదన మిగిల్చి..

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని యువతి..


అర్చన

జగదేవపూర్: ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం అనంతసాగర్ గ్రామంలో జరిగింది. ఎస్ఐ జనార్దన్ తెలిపిన వివరాలు.. దాసరి అర్చన (18) గజ్వేల్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. గ్రామానికి చెందిన యువకుడిని ప్రేమిస్తోంది. విషయం గ్రహించిన తల్లిదండ్రులు మరో సంబంధం వెతికి పెళ్లికి ఒప్పించారు. అర్చన తల్లిదండ్రులు మంగళవారం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఉరి వేసుకుంది. తల్లిదండ్రులు మధ్యాహ్నం ఇంటికొచ్చేసరికి తలుపు పెట్టి ఉంది. స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఉరేసుకొని మృతి చెంది కనిపించింది. యువతికి తల్లిదండ్రులు, ఇద్దరు అక్కాచెల్లెళ్లు, ఒక సోదరుడు ఉన్నారు. ఈ కుటుంబంలో అర్చన ద్వితీయ సంతానం. తల్లి మల్లమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

భూమి ఇవ్వలేదని మనస్తాపానికి గురై..

సదాశివపేట: మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని తంగెడిపల్లిలో రెండు రోజుల కిందట జరిగింది. మంగళవారం వెలుగులోకి వచ్చింది. సదాశివపేట సీఐ మహేష్‌గౌడ్ తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన సిరిపురం రాములు(33)తన వాటాకు చెందిన భూమి ఇవ్వాలని తల్లితండ్రులను కోరినా ఇవ్వలేదు. బావ, చెల్లెలు కూడా అంగీకరించలేదు. దీంతో మనోవేదనకు గురై గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో పెద్దల సమక్షంలో భూ పంచాయతీ తేల్చేవరకు మృతదేహాన్ని తరలించవద్దని రాములు బావమరిది పట్టుబట్టాడు. దీంతో రెండు రోజులుగా మృతదేహాన్ని ఇంట్లోనే ఉంచారు. మంగళవారం పెద్దల సమక్షంలో ఒప్పందం కుదరడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యానికి బానిసై యువకుడు..

కల్హేర్, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లి గ్రామానికి చెందిన నిజాంపేట్ శరత్(30) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై వెంకటేశం తెలిపారు. శరత్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. గ్రామంలో మెడికల్ దుకాణం పెడతానని, డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. గతంలో చేయి కోసుకొని బెదిరించాడు. సోమవారం సాయంత్రం మరోసారి డబ్బులు డిమాండు చేయగా వారు అంగీకరించలేదు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం శరత్‌ను నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు ఎస్సై వివరించారు. తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అభినవ.. ద్రోనాచార్య!



ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి: ఒక వినూత్న ఆలోచన.. సమాజం పురోభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు దోహదపడుతుంది. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిస్తోంది. కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోంది. భవిష్యత్తులో పలు రంగాల్లో డ్రోన్ టెక్నాలజీ కీలక మార్పులు తీసుకురానుంది. ఇప్పుడిప్పుడే అనేక అవసరాలకు డ్రోన్లు అక్కరకొస్తున్నాయి. ఈ రంగంలో కొత్త ఆవిష్కరణలు, విభిన్న అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు, వాటిల్లో నూతన సాంకేతికత, అభివృద్ధిలో డ్రోన్ల పాత్ర, తదితర అంశాలతో పాటు భవిష్యత్తు మార్గసూచీపై ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా మంగళగిరిలో 'అమరావతి డ్రోన్ సమ్మిట్' ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులు, సందర్శకులు భారీగా పాల్గొన్నారు.

సొంతంగా ఎదగాలనే స్టార్టప్

– పురంధర్, ఎంటెక్, ఐఐటీ హైదరాబాద్

నాకు విదేశీ వస్తువులంటే పెద్దగా ఇష్టం ఉండదు. దేశీయంగా తయారు చేయాలనే పట్టుదలతోనే స్టార్టప్ నెలకొల్పాను. నేను అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ చదివాక హైదరాబాద్ ఐఐటీలో ఇటీవలే ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ పూర్తి చేశా. ఐఐటీ ప్రాంగణంలో ఉన్న టింకర్స్ ల్యాబ్‌లో ఎక్కువ సమయం గడిపా. అక్కడ సొంతంగా రోబోటిక్ చేయి తయారీకి చాలా కష్టపడ్డా. ఆ ప్రయోగం విఫలమైంది. ఇది నాలో పట్టుదల పెంచింది. డ్రోన్ల ప్రాజెక్టుకు 'ఆమని ఆటోమేషన్', కృత్రిమ మేధస్సుకు 'ఎక్స్ న్యాపిల్' అనే స్టార్టప్స్ ఏర్పాటు చేశాను. డ్రోన్ల వేగం నియంత్రణకు ఎలక్ట్రానిక్ స్పీడ్ కంట్రోలర్ (ఈఎస్‌సీ) పరికరాలు సొంతంగా తయారుచేస్తున్నా. నిపుణుల బృందం సహకారంతో ఆర్డర్లు తీసుకుని సరఫరా చేస్తున్నా. వచ్చిన లాభంలో వారికి వాటా ఇస్తున్నా. భవిష్యత్తులో రోబోటిక్స్‌లో పరిశోధనలపై దృష్టి సారిస్తా. సాంకేతిక పరిజ్ఞానంతో బయోడీజిల్ తయారు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

పట్టణ ప్రణాళికకు డ్రోన్ సర్వే

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి, తాండూరు


వికారాబాద్ పట్టణంలో సర్వే ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల తదితరులు

పట్టణ రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేసింది. ఇందుకు పట్టణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు సంబంధిత అధికారులు సాధారణంగా అన్ని వార్డులు తిరిగి సర్వే చేపడుతుంటారు. వికారాబాద్ జిల్లాలో మాత్రం కొత్తగా డ్రోన్ ద్వారా సర్వేకు శ్రీకారం చుట్టడం విశేషం. జిల్లాలోని వికారాబాద్, తాండూరు పురపాలికల్లో ఆధునిక సాంకేతికను వినియోగిస్తుండటం విశేషం.

10 రోజుల పాటు..

వికారాబాద్‌లో ఈ నెల 16న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే ప్రారంభించారు. పట్టణంలో ఈనెల 25 వరకు ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకు గాను 2 డ్రోన్లు వినియోగిస్తున్నారు. 5 మంది సాంకేతిక, 10 మంది పుర సిబ్బంది రెండు బృందాలుగా వీడి ఇందులో పాల్గొంటున్నారు. వికారాబాద్ 122 కి.మీ. మేర విస్తరించి ఉండగా, క్లస్టర్లుగా విభజించి 100 పాయింట్లు నిర్దేశించారు. అక్కడి నుంచి డ్రోన్ సాయంతో దాని పరిధిలోని ప్రాంతాన్ని చిత్రీకరిస్తారు. ఎక్కడ రోడ్డు, ఖాళీ ప్రదేశం ఉంది, నిర్మాణాలు ఎక్కడ ఉన్నాయి, ప్రభుత్వ కార్యాలయాలు, వీధి దీపాలు, పార్కులు, తాగునీటి పైపులైన్లు, సెల్ టవర్స్, తాగునీటి రిజర్వాయర్లు, వైకుంఠధామం, తదితర వాటన్నింటినీ సేకరించి బేస్ మ్యాప్ రూపొందిస్తారు.

జిల్లాలో ఇలా

పురపాలిక	జనాభా	వార్డులు
తాండూర్	71,008	38
వికారాబాద్	63,646	34
పరిగి	18,242	15
కొడంగల్	14,519	12


క్రోడీకరించి నివేదిక..

కేంద్రం అమృత్ 2.0 కింద డ్రోన్ కెమెరాలతో సర్వేకు ఎంపిక చేసింది. వీటి ద్వారా సేకరించిన సమాచారం, చిత్రాలను క్రోడీకరించి నివేదిక రూపొందిస్తారు. రానున్న 30-40 ఏళ్లలో అభివృద్ధికి తగ్గట్టుగా ప్రణాళిక తయారుచేస్తారు. ప్రస్తుతం ఏళ్ల కిందట రూపొందించిన మాస్టర్ ప్లానే ఇప్పటికీ కొనసాగుతోంది. పట్టణానికి కొత్త రూపు వచ్చేలా డ్రోన్ సర్వే దోహదపడనుంది. అభివృద్ధికి డ్రోన్ యంత్రం చిత్రాల బేస్ మ్యాప్ కీలకంగా మారనుంది. ఇప్పటికే వికారాబాద్, పరిగిలో ఈ కొత్త సర్వే మొదలవగా, తాండూరులో 26 నుంచి చేపట్టనున్నారు. 2050ని దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్ తయారు చేయనున్నారు.

క్షుణ్నంగా పరిశీలించి.. రాకేశ్‌రెడ్డి, ఇన్‌ఛార్జి కమిషనర్, వికారాబాద్

పట్టణంలో డ్రోన్ యంత్రాలతో ఈనెల 25 వరకు సర్వే నిర్వహిస్తారు. అన్ని అంశాలను క్షుణ్నంగా పరిశీలించి నివేదిక రూపొందిస్తాం. రానున్న 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని తయారుచేయనున్నాం. ఆ మేర అభివృద్ధి చేయాల్సిన తీరుపై విశ్లేషిస్తాం.

వాహనం అదుపుతప్పి.. రైతు దుర్మరణం


అశోక్

ములుగు, న్యూస్‌టుడే: అత్తగారింటికి వెళ్లిన ఓ రైతు తిరిగివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా మర్కుక్ ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కుక్‌కు చెందిన అచ్చంగారి అశోక్ (38), సునీత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. దామోదర్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం అత్తగారి ఊరు జగదేవపూర్ మండలం రాయవరం గ్రామానికి శేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. అదే రోజుగా తిరుగు ప్రయాణం కాగా, అంగడి కిష్టాపూర్ గ్రామం వద్ద వాహనం అదుపు తప్పడంతో స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు మెరుగైన వైద్యానికి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతి చెందాడు. సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.

యువకుడి అనుమానాస్పద మృతి


కృష్ణ

నిజాంపేట(రామాయంపేట), న్యూస్‌టుడే: ఇంట్లో నుంచి వెళ్లిన యువకుడు శవమై కనిపించాడు. ఈ ఘటన నిజాంపేట మండల పరిధి కల్వకుంటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. . కల్వకుంటకు చెందిన ముష్టిగొల్ల కృష్ణ(32) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిన కృష్ణ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు మంగళవారం వెతుకుతుండగా గ్రామ శివారులోని చెట్టు కింద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతునికి భార్య మంజుల, పిల్లలు ఉన్నారు. తల్లి బాలమణి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

రైతులను బలిగొన్న విద్యుత్తు తీగ


విద్యుత్తు తీగ తగిలి మృతిచెందిన శివశంకర్


వట్‌పల్లి, న్యూస్‌టుడే: అడవి పందుల బెడద నుంచి వరి పంటను కాపాడుకునేందుకు వేసిన విద్యుత్తు తీగ యమపాశమై పోతులబోగుడ గ్రామానికి చెందిన రైతు ఎం.శివశంకర్(30)ను బలిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. శివశంకర్ ఖరీఫ్‌లో వరి సాగు చేశారు. అడవి పందులు పంటను ధ్వంసం చేస్తుండటంతో వాటిని నియంత్రించేందుకు పొలం చుట్టూ విద్యుత్తు తీగతో కంచె ఏర్పాటు చేశారు. కాపలా కోసం సోమవారం రాత్రి ఇంటి నుంచి చేనుకు వెళ్లారు. మంగళవారం ఇంటికి రాకపోవడంతో ఆటో నడపడానికి వెళ్లారేమోనని కుటుంబసభ్యులు భావించారు. సాయంత్రం వరకు రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు చేనుకు వెళ్లి పరిశీలించగా పంట రక్షణకు వేసిన తీగకు తగిలి విగతజీవిగా కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మరమ్మతులు చేస్తూ లైన్‌మెన్..


నవీన్

ఝరాసంగం: నియంత్రికకు మరమ్మతులు చేస్తున్న ఓ లైన్‌మెన్ విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం చీల్కేపల్లి గ్రామస్థులు తెలిపిన వివరాలు.. జహీరాబాద్ మండలం హుగ్గెల్లికి చెందిన నవీన్ (34) మూడేళ్లుగా చీల్కేపల్లిలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉపకేంద్రం నుంచి లైన్‌క్లియర్ తీసుకుని నియంత్రిక వద్ద ఫ్యూజ్ తీగను సరిచేస్తున్నాడు. ఒక్కసారిగా విద్యుత్తు సరఫరా కాగా షాక్ కొట్టి కిందపడ్డాడు. తలకు చెట్టుకొమ్మ బలంగా తగిలింది. అధికారులు వెంటనే చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి రెండేళ్ల పాప, నాలుగు నెలల బాబు ఉన్నాడు. ఎస్ఐ నరేశ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

మహిళ ప్రాణం తీసిన విద్యుత్తు కంచె


బుజ్జిబాయి

కౌడిపల్లి: పంట రక్షణకు బిగించిన విద్యుత్తు కంచె తగిలి మహిళ దుర్మరణం చెందిన ఘటన కౌడిపల్లి మండలం జాజి తండాలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. తండాకు చెందిన కాట్రోత్ బుజ్జిబాయి(38) వ్యవసాయంతో పాటు మేకల పెంపకంతో జీవనం సాగిస్తోంది. మంగళవారం అడవి పందుల రక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ వైర్‌కు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి తీయకుండా అలాగే ఉంచారు. విషయం తెలియక పక్కనే మేకలు మేపుతున్న బుజ్జిబాయి.. అవి పొలంలోకి వెళ్లడంతో వాటితో పాటు ఆమె వెళ్లి విద్యుదాఘాతానికి గురైంది. రెండు మేకలతో పాటు బుజ్జిబాయి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని తరలించకుండా తండావాసులు అడ్డుకున్నారు. ప్రమాదానికి కారణమైన వారిని ఘటనా స్థలానికి రప్పించాలని డిమాండ్ చేశారు. ఎట్టకేలకు పోలీసులు నచ్చజెప్పి మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పైపులైన్ కనెక్షన్ ఇస్తే నీటి సదుపాయం

జిన్నారం, న్యూస్‌టుడే: కలెక్టర్ వల్లూరి క్రాంతిని మంగళవారం న్యూల్యాండ్ పరిశ్రమ ప్రతినిధులు, మాజీ సర్పంచి చిట్ల సత్యనారాయణ కలిశారు. 181 జీఎంఆర్ కాలనీలో సీఎస్ఆర్ నిధులతో నీటి సంపు నిర్మించడానికి పరిశ్రమ ముందుకు వచ్చిన నేపథ్యంలో కలిశారు. గతంలో రూ.30 లక్షలు వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసినట్లు పేర్కొన్నారు. కాలనీకి నీటి సదుపాయం కలగాలంటే సంపు నిర్మాణం అవసరమని, మిషన్ భగీరథ పైపులైన్ నుంచి కనెక్షన్ ఇవ్వాలని కోరారు. కాలనీలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు జ్ఞాపిక అందించారు. పరిశ్రమ ప్రతినిధి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌కు పాల్పడితే చర్యలు

కోహీర్, న్యూస్‌టుడే: మండల పరిధిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటామని తహసీల్దారు బాలశంకర్ పేర్కొన్నారు. మైనింగ్ నియంత్రణకు ఉప తహసీల్దారు వరప్రసాద్, ఆర్ఐ సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్లు వలీయుద్దీన్, మాన్‌సింగ్ నేతృత్వంలో రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అక్రమార్కులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు.

ప్రవర్తన మార్చుకోవాలి: సీఐ

సిర్గాపూర్: యువకులు గతంలో తప్పుడు పనులు చేసినా ఇప్పట్నుంచైనా ప్రవర్తన మార్చుకొని సమాజంలో సత్ప్రవర్తనతో మెలగాలని కంగ్టి సీఐ చంద్రశేఖర్ రెడ్డి యువతకు సూచించారు. గతంలో గంజాయి మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాతో సంబంధమున్న సర్కిల్ పరిధిలోని సిర్గాపూర్, కంగ్టి మండలాల వారితో కౌన్సెలింగ్ నిర్వహించారు. పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఎస్సై వెంకట్ రెడ్డి ఉన్నారు.

గుంతల రోడ్డు మరమ్మతుకు చర్యలు

జిన్నారం, న్యూస్‌టుడే: మాదారం నుంచి బాహ్యవలయ రహదారి వరకు గుంతలను పూడ్చి మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్ అండ్ బీ డీఈఈ రామకృష్ణ, ఏఈ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం మాదారం శివారులోని రహదారిని మాజీ సర్పంచి సురేందర్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. రోడ్ల మరమ్మతుకు కంకర క్రషర్ల యాజమాన్యాలు నిధులు ఇచ్చేందుకు ముందుకు రాగా పనులు ప్రారంభించినట్లు చెప్పారు. దీని వల్ల అనేక గ్రామాల ప్రయాణికులకు మేలు జరుగుతుందన్నారు. కార్యదర్శి నవీన్‌కుమార్, గణేశ్, సుదర్శన్, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

ఝరాసంగం: గినియార్‌పల్లి, ఈదులపల్లి గ్రామాలను ఎంపీడీవో సుధాకర్ మంగళవారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు పరిశీలించారు. ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.

భవనాల నిర్మాణానికి స్థల ప్రతిపాదన

జిన్నారం: మండలంలోని ఖాజీపల్లి పంచాయతీ పరిధి 181 జీఎంఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాల, ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు లేబర్ వెల్ఫేర్ సెంటర్ల ఏర్పాటుకు స్థల ప్రతిపాదన పంపినట్లు తహసీల్దార్ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 181 సర్వే నంబరులో స్థలాన్ని గుర్తించామన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి కాలనీకి వచ్చిన నేపథ్యంలో పాఠశాల ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలని ఆదేశించిన విషయం తెలిసిందే.

సమస్యలతో సహవాసం

పోతిరెడ్డిపల్లి సంగారెడ్డి పట్టణంలోకి విలీనం కావడంతో గతానికి భిన్నంగా అభివృద్ధి అవుతున్నా, అదే స్థాయిలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రధానంగా అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు, తాగునీరు, విద్య, వైద్యం, విద్యుత్తు, తదితర సమస్యలు వేధిస్తున్నాయి.


పోతిరెడ్డిపల్లిలోని జాతీయ రహదారి పక్కనే నిలిచిన మురుగు

న్యూస్‌టుడే, పోతిరెడ్డిపల్లి(సంగారెడ్డి అర్బన్)

వసతుల లేమితో ఇబ్బందులు

పోతిరెడ్డిపల్లిలో కొత్తగా ఏర్పడిన సాయినగర్, ఆర్టీసీ, రెడ్డి, నాగర్జున కాలనీ, కేతకి సంగమేశ్వర్ నగర్, శిల్పవెంచర్, తదితర కాలనీల వాసులు సమస్యలతో సహవాసం చేయాల్సి వస్తోంది. చివరి ఇంటి వరకు తాగునీటి సౌకర్యం లేదు. మంచి నీటి ట్యాంకును కలెక్టరేట్ వెనక విభాగంలో కట్టినా సుమారు 10 కిలో మీటర్ల మేర పైపులైన్ ఏర్పాటు చేస్తే నీరు సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుంది. ప్రధానంగా మిషన్ భగీరథ, పురపాలక, ప్రజా ఆరోగ్యశాఖ ఇంజినీరింగ్ అధికారుల వైఫల్యం కారణంగా తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో డబ్బా నీళ్లు కొంటున్నామని వాపోతున్నారు. కొత్త కాలనీలో విద్యుత్తు దీపాలు లేవు. మిగిలిన కాలనీల్లో కొన్ని వెలగడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.


సర్వీస్ రోడ్డు పక్కనే ప్రమాదకర గుంత

వైద్యసేవలు అంతంతే..

పట్టణంలోని ఆరు వార్డులకు కేవలం 12వ వార్డు పరిధిలో ఆరోగ్య ఉప కేంద్రం ఉంది. అక్కడ ఇది వరకు స్థానికంగా ఏఎన్ఎం నివాసం ఉండేవారు. 24 గంటలు వైద్య సేవలు అందేవి. నాలుగేళ్ల నుంచి ఏఎన్ఎం ఉండటం లేదు. టీకాలు, గర్భిణులకు సేవలు తప్ప మిగిలిన పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదని ఆరోపణలున్నాయి. విద్యానగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆ కల నెరవేరడం లేదు.

ఫిర్యాదులు పరిష్కరిస్తున్నాం

పోతిరెడ్డిపల్లి పరిధిలోని ఆరు వార్డుల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు అధిగమిస్తాం. ప్రజావాణి, పురపాలక కార్యాలయంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేలా అధికారులతో సమావేశం నిర్వహిస్తాం. ఆయా సమస్యలు ఏ దశల్లో ఉన్నాయి.. ఎటువంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తాం. **-ఇంతియాజ్ అహ్మద్, పురపాలక శాఖ, డిప్యూటీ ఈఈ.**

అంతర్గత రహదారులు, మురుగు కాల్వలు అధ్వానం..

పట్టణంలోని ఆరు వార్డుల్లో ప్రధానంగా అంతర్గత రహదారులు పెద్దగా లేవు. విద్యానగర్, బ్యాంకు కాలనీ, ధనవంతులు ఉన్నా కాలనీలో మాత్రం సీసీ రహదారులు, మురుగు కాల్వలు ఉండగా మిగిలిన వీధుల్లో చాలా చోట్ల లేవు. ప్రధానంగా 65వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో రహదారి విస్తరణలో మొక్కుబడిగా మురుగు కాల్వ కట్టారు. ఆయా కాల్వలు పై కప్పులు పూర్తిగా పోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో రహదారి వెంట మురుగు నీరు పారుతోంది. ఆ దారుల వెంట వెళ్లే ప్రయాణికులు, పాదచారులు, చోదకులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో విరాళాలు సేకరించి రహదారులు, మురుగు కాల్వలు సొంతంగా నిర్మించుకోవాల్సి వస్తుందని శిల్పవెంచర్ వాసులు వాపోయారు.

న్యూస్‌టుడే, నారాయణఖేడ్, ? కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌కూడలి వద్ద మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ రోడ్డంతా అధ్వానంగా మారుతుంది. దుర్వాసన రావడంతో పాటు రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. **-మారుతి, ఖేడ్**

✓ ఎప్పటికప్పుడు మురుగు కాల్వల్లోని చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడంతో పాటు సమస్య శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. **-శ్రీనివాస్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, ఖేడ్ పురపాలిక**

అడవి తీగల తొలగింపు

స్పందనకు వందనం

జోగిపేట, న్యూస్‌టుడే: అందోలు శివారులోని జాతీయ రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాల తీగలకు అడవి తీగలు అల్లుకోవడంపై ‘తీగల వెనక ప్రమాదం’ అనే శీర్షికన ఈ నెల 21న ‘ఈనాడు’లో చిత్రకథనం ప్రచురితం అయింది. దీనికి విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. అడవి తీగలు పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు.

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు మంగళవారం క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. మొత్తం రూ.3,31,050ల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. భారాస మండల అధ్యక్షుడు వెంకటేశం, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులు అరికట్టాలని నిరసన

సిర్గాపూర్, న్యూస్‌టుడే: ఆలయాలపై దాడులను అరికట్టాలని డిమాండు చేస్తూ హిందూ సంఘాల నాయకులు మంగళవారం సిర్గాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు. సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ ఆలయ ఘటనపై విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండు చేశారు.


సిర్గాపూర్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

‘తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందే’

కల్హేర్, న్యూస్‌టుడే: వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండు చేశారు. మంగళవారం ఆయన క్రిష్టాపూర్-నాగధర్ గ్రామాల మధ్య రోడ్డుపై ఆరబెట్టిన వరిని పరిశీలించారు. రైతులకు పూర్తి స్థాయి మద్దతు ధర లభించే వరకు వారి వెంటే ఉంటూ పోరాటం చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు రాంసింగ్, అలీ, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సాయిలు పాల్గొన్నారు.


ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రైతుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. వరికోతలు 95 శాతం పూర్తయినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు.

నైపుణ్యాలతోనే ఉద్యోగాల సాధన

జహీరాబాద్, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచంలో యువత అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే ఉద్యోగాలు సాధించడంతో పాటు, స్వయం ఉపాధికి బాటలు వేసుకోవచ్చని టాస్క్ శిక్షకుడు ప్రవీణ్ పేర్కొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో మంగళవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్ హరికుమార్, వెంకట్రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహులు, ఇతరులు పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అందోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే అమ్మి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ సీఈవో నర్సింలు కోరారు. కార్యక్రమంలో రైతులు, ఏఎంసీ అధికారులు పాల్గొన్నారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అందోలు పీఏసీఎస్ సీఈవో నర్సింలు

కానుకుంట(గుమ్మడిదల): ధాన్యం కొనుగోలు చేయడానికి గుమ్మడిదల మండలంలో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ఏవో శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం కానుకుంట రైతు వేదికలో ధాన్యం కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపీఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

పుల్కల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఎంఈవో శంకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల పరిధిలోని రాయిపహాడ్ ప్రాథమిక, పెద్దారెడ్డిపేట ఉన్నత పాఠశాలలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు త్రైమాసిక పరీక్షలు కొనసాగుతుండగా.. పరిశీలించారు. పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని సూచించారు.


పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న ఎంఈవో శంకర్

ఎట్టకేలకు కందకం శుభ్రం

జోగిపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని 17వ వార్డులో కందకం ఉండేది. అందులో గత కొన్నేళ్లుగా ముళ్ల పొదలు పెరిగి పందులు, దోమలు, పాములకు ఆవాసంగా మారింది. దీంతో స్థానికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వార్డు కౌన్సిలర్ చిట్టిబాబు మంగళవారం పుర సిబ్బందితో ఆ కందకాన్ని జేసీబీతో పూర్తిగా శుభ్రం చేయించారు.

నేడు ఖేడ్ బంద్‌కు పిలుపు

నారాయణఖేడ్: ఆలయాలపై దాడులను నిరసిస్తూ బుధవారం ఖేడ్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు తెలిపారు. అన్ని వర్గాల వారు బంద్‌కు సహకరించాలని కోరారు.

అణగారిన వర్గాల ఆత్మబంధువు కొమురం భీమ్

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: నిజాంకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు కొమురం భీమ్ అని కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్‌లో కొమురం భీమ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు ఆత్మబంధువుగా పని చేశారన్నారు. ఆదివాసీలపై నిజాం సర్కార్ పాశవిక చర్యలకు పాల్పడిన సందర్భంలో జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోరాడి వీర మరణం పొందారని కొనియాడారు.


నివాళులర్పిస్తున్న నీలం మధు తదితరులు

శుద్ధ జలం అందించడమే లక్ష్యం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధి జలం అందించడమే లక్ష్యంగా నీటి సరఫరా సిబ్బంది పనిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ కుమార్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోని పంచాయతీ తాగునీటి సరఫరా విభాగం సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చేతి పంపు పనితీరు, మరమ్మతులపై ప్రయోగాత్మకంగా వివరించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

జోగిపేట టౌన్: పౌరసరఫరాల శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు మంగళవారం పట్టణంలోని పలు దుకాణాలపై దాడులు చేశారు. ఇద్దరు వ్యాపారులు అక్రమంగా నిల్వ ఉంచిన 13 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు సివిల్ సప్లయ్ విజిలెన్స్ ఓఎస్‌డీ డి.ద్రోణాచారి తెలిపారు. బియ్యాన్ని అందోలు ఎంఎల్ఎస్ పాయింట్‌లో నిల్వ చేసినట్లు పేర్కొన్నారు.

అయోడిన్ లోపం తలెత్తనివ్వొద్దు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పిల్లలో అయోడిన్ లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం గుమ్మడిదల ఎండీడీవో ఉమాదేవి, వైద్యుడు మధుకర్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో కలిసి గ్రామంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

జోగిపేట టౌన్: జోగిపేట జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా హరినారాయణ వర్మ, ఉపాధ్యక్షుడిగా ఈశ్వరయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఇంద్రసేనరెడ్డి, మల్లేశం, కోశాధికారి శివప్రసాద్, లైబ్రేరియన్‌గా లింగమయ్య, స్పోర్ట్స్ కార్యదర్శిగా నర్సింలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సంగమేశ్వర్

సమీకృత మార్కెట్‌పై దృష్టి పెట్టండి

జహీరాబాద్, న్యూస్‌టుడే: పట్టణంలో నిర్మించిన సమీకృత మార్కెట్‌పై దృష్టి పెట్టాలని మాజీ కౌన్సిలర్ నామారవికిరణ్ కోరారు. ఈ క్రమంలోనే సముదాయంలోని దుకాణాలను లబ్ధిదారులకు కేటాయించాలని మంగళవారం సంగారెడ్డిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

యువత, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

జహీరాబాద్: యువత, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం ప్రతిపాదించిన కె.ఆనంద్‌రెడ్డి, పి.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. మంగళవారం వారు జహీరాబాద్ పట్టణంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల యజమానులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు.

మొగుడంపల్లి భారాస అధ్యక్షుడిగా సంజీవరెడ్డి

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: మండల భారాస అధ్యక్షుడిగా సంజీవరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు నియామక పత్రం అందజేశారు. అందరి సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

పల్వట్లలో దొంగతనం

వట్‌పల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పల్వట్లలో చోరీ జరిగింది. సీఐ అనిల్‌కుమార్ మంగళవారం ఆ ఇంటిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆయన తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వృద్ధురాలు సునందమ్మ ఇంటికి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి వచ్చి పిలవడంతో తలుపు తీసిందన్నారు. వెంటనే వారి వెంట తెచ్చుకున్న మత్తు పదార్థాన్ని ఆమెపై చల్లడంతో స్పృహ కోల్పోయిందని, ఈ క్రమంలోనే ఆమె ఒంటిపై ఉన్న ఐదున్నర తులాల బంగారు ఆభరణాలు, బీరువాలో ఉన్న రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు. అనంతరం వట్‌పల్లి ఠాణాను తనిఖీ చేసి కేసుల నమోదు, పరిష్కారంపై ఆరా తీశారు.

డీఏలు, బిల్లులు చెల్లించండి: తపస్

నారాయణఖేడ్, న్యూస్‌టుడే: పెండింగులో ఉన్న డీఏలు, అన్ని రకాల బిల్లులను వెంటనే చెల్లించడంతో పాటు పీఆర్సీ ప్రకటించాలని డిమాండు చేస్తూ తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం రుద్రారం ప్రాథమికోన్నత పాఠశాల, మిగతా పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తపస్ మండల అధ్యక్షుడు జగదీశ్వర్, రవీందర్, సుకుమార్, జైపాల్, శివాజీ, గోవింద్, దత్తాత్రి పాల్గొన్నారు.

సంగారెడ్డి గ్రామీణ: పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే పరిష్కరించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఇస్మాయిల్ ఖాన్‌పేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తుగొండ కోరారు. మండల పరిధి ఇస్మాయిల్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ధర్మాగ్రహ దీక్ష చేపట్టారు. తపస్ ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించామన్నారు.


రుద్రారంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

దుకాణాలు కేటాయించేదెప్పుడో?

- రోడ్లపైనే వ్యాపారాలు
- వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య


నిరుపయోగంగా కూరగాయల షెడ్లు


జాతీయ రహదారి పక్కనే వ్యాపారాలు

న్యూస్‌టుడే, జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని రహదారులు, మురుగు కాల్వలపైన నిర్వహిస్తున్న కూరగాయలు, మాసం, చేపల వ్యాపారాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని దూరం చేయాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో రూ.11 కోట్లతో నడి పట్టణంలో సమీకృత కూరగాయలు, కమర్షియల్ కాంప్లెక్స్ దుకాణాల సముదాయం చేపట్టారు. కాని స్టాళ్ల కేటాయింపులో తీవ్ర జాప్యం అవుతోంది. దీంతో కూరగాయల వ్యాపారుల కోసం సెల్లులార్‌లో నిర్మించిన స్టాళ్లు నిరుపయోగంగా మారగా, ప్రస్తుతం రహదారి పక్కనే వ్యాపారం నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

జాతీయ రహదారి పక్కన నడి పట్టణంలో అత్యంత ఖరీదైన స్థలంలో నిర్మించిన సమీకృత మార్కెట్ భవన సముదాయంలోని సెల్లులార్‌లో వెజ్, నాన్‌వెజ్ వ్యాపారాల కోసం 84 స్టాళ్లు నిర్మించారు. ఈ భవనాన్ని 2022 డిసెంబరు 27న అప్పటి మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. వాటిని కూరగాయల వ్యాపారులకు కేటాయించినప్పటికి కొద్ది రోజులకే తిరిగి భవనం ముందు జాతీయ రహదారిపై వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

అనువుగా లేకపోవడంతో..

సముదాయంలో దుకాణాలు లోపలికి ఉండటం, సరిపడా వెలుతురు లేకపోవడం, నీటి వసతి, రాకపోకలకు దారి అనువుగా లేక గిరాకీ రావడం లేదని రహదారి పక్కన విక్రయాలు చేసుకుంటున్నామని పలువురు కూరగాయల వ్యాపారులు తెలిపారు. వర్షాలు కురిసినప్పుడు వరద నీరు సెల్లులార్‌లోకి వచ్చి షెడ్ల చుట్టూ నిలుస్తుందని, దారి(ర్యాంపు) లోతుగా ఉండటంతో వ్యాపారులు, కొనుగోలు దారులు నిత్యం కాలు జారి కిందపడి గాయాల పాలవుతున్నారని వాపోయారు. రహదారుల పక్కన కూరగాయల వ్యాపారాలు నిర్వహిస్తుండగా, కొనుగోలుదారుల, వ్యాపారులు, రవాణా వాహనాలు రహదారిపై నిలుపు తుండటంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో ఇటువైపు రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

త్వరలోనే పరిష్కారం

సెల్లులార్‌లో స్టాళ్లు ఏర్పాటు చేసిన చోట తలెత్తుతున్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరించి త్వరలోనే వినియోగంలోకి తీసుకొస్తాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్కడి నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే స్టాళ్లను కేటాయించడంతో పాటు కూరగాయల వ్యాపారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **-శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్, జహీరాబాద్.**